# గుంటూరుజిల్లా చుండూరు దళితులపై
# అగ్రకుల దురహంకారుల హత్యాకాండ

---

# నిజనిర్ధారణ కమిటీ నివేదిక

---


ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం **APCLC**

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ **OPDR**

ఆంధ్రప్రదేశ్

ప్రచురణ కాలము
ఆగస్టు - 91.

ప్రతులు - పదివేలు

వెల : ఒక రూపాయి

కాపీలకు, వివరాలకు
C. భాస్కరరావు
OPDR ప్రధాన కార్యదర్శి
నగరం, తెనాలి RMS
గుంటూరుజిల్లా

డా॥ కె. బాలగోపాల్
APCLC ప్రధాన కార్యదర్శి
శాతవాహన మెస్ వెనుక
నారాయణగూడ
హైద్రాబాద్

# చుండూరు దళితులపై హత్యాకాండ

## APCLC - OPDR నిజ నిర్ధారణ కమిటీ నివేదిక

**నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు :**

ఆగస్టు 6వ తేదీన గుంటూరుజిల్లా చుండూరు గ్రామంలోని దళితులపై అగ్ర కులాలు జరిపిన దాడిలో దళితుల ఎనిమిది మృతదేహాలు లభ్యమైనట్లుగాను 14మంది దళితులు గల్లంతు ఐనట్లుగా వార్తాపత్రికలు సంబంధిత పోలీసు ప్రభుత్వాధికారులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంచలనాన్ని కలిగించిన ఈ హత్యాకాండపై వాస్తవ పరిశీలనకోసం OPDR-APCLC 14 మంది సభ్యులతో కూడిన ఒక బృందాన్ని నియమించాయి. ఈ కమిటీ ఆగస్టు 8, 9 తేదీలల్లో తెనాలి ఐతానగర్ లోని సాల్వేషన్ ఆర్మీ చర్చ్‌లో తలదాచుకుంటున్న చుండూరు దళితుల్ని ఇంటర్వ్యూ చేసింది. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, చుండూరు పల్లెలో మిగిలి ఉన్న వృద్ధులను, పెద్దలను మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు శ్రీకాంత్‌గారిని కలిసింది. చుండూరు గ్రామంలోనే జిల్లా SP మీనాను కలిసింది. సంఘటన జరిగిన స్థలాలను (మల్లెతోట, తూర్పుకాలువ, తుంగభద్రాడ్రైన్) కమిటీ పరిశీలించింది. అలాగే చుండూరు గ్రామంలోని అగ్రకులాల (రెడ్లు, కాపుల)కు చెందిన మహిళలతో వృద్ధులతోను మాట్లాడింది. వీరందరూ చెప్పిన విషయాలను, ఒక క్రమపద్ధతిలో సమీక్షించిన కమిటి చుండూరు, దాని పరిసరగ్రామాల్లో పరిస్థితులు ఈ క్రింది విధంగా వున్నాయనే అభిప్రాయానికి వచ్చింది.

ఈ నిజ నిర్ధారణ కమిటీలో దిగువ పేర్కొన్నవారు సభ్యులుగా ఉన్నారు.

1. టి. ఎల్. నారాయణ [లెక్చరర్, అధ్యక్షుడు OPDR]
2. డాక్టర్ అబ్దుల్ నూర్ బాషా [యూనివర్శిటీ లెక్చరర్ APCLC జిల్లా అధ్యక్షుడు]
3. ఎ. సుబ్రహ్మణ్యం [సంయుక్త కార్యదర్శి APCLC, లా. లెక్చరర్]
4. పి. కోటిరెడ్డి [OPDR రాష్ట్రకమిటీ సభ్యుడు]
5. దర్శి శివకోటేశ్వరరావు [లాయర్- APCLC, గుంటూరుజిల్లా ఉపాధ్యక్షుడు]
6. పి. రాజారావు [లాయర్ - APCLC, గుంటూరుజిల్లా ఉపాధ్యక్షుడు]

7. పి. జె. వర్ధనరావు [లెక్చరర్ - తెనాలి VSR కళాశాల]
8. బి. చంద్రశేఖర్ [లాయర్ - APCLC గుంటూరుజిల్లా కార్యదర్శి]
9. సి. హెచ్. సుధాకర్ [రాష్ట్రీ కోశాధికారి - OPDR]
10. జె. చెన్నకేశవరావు [లాయర్ - OPDR, గుంటూరుజిల్లా కార్యదర్శి]
11. కె. గోవర్ధన్ [APCLC గుంటూరుజిల్లా సంయుక్త కార్యదర్శి]
12. సి. హెచ్. సాంబయ్య [APCLC జిల్లా కమిటీ సభ్యులు]
13. J. J. లవణం ”
14. డి. రాధాకృష్ణమూర్తి ”
15. కోటా లక్ష్మయ్య ”
16. దండు వెంకటేశ్వరరావు ”

## చుండూరు సంఘటన - ఆర్థిక, సాంఘిక నేపథ్యం :

ఏ ప్రాంత ప్రజల అభివృద్ధి అయినా ఆ ప్రాంతంలోని ఉత్పత్తి సాధనాల, శక్తుల అభివృద్ధిపై ఆధారపడివుంటుందనేది నిర్వివాదాంశం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితి రాయలసీమ, తెలంగాణ జిల్లాలమీద కోస్తాంధ్ర ప్రాంతంలో, కొంత అభివృద్ధికరంగా ఉంది. అందులోనూ ముఖ్యంగా కృష్ణా, గోదావరి జీవనదులతో అలలాగే ఈ ప్రాంతంలో ప్రకాశం బ్యారేజి, ధవళేశ్వరం ఆనకట్టల మూలంగా తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు జిల్లాలు, ప్రకాశంజిల్లాలో కొంతభాగం వ్యవసాయోత్పత్తులలో ప్రధానపాత్ర వహిస్తున్నాయి. కృష్ణా, గోదావరి బేసిన్‌లో సాంద్ర వ్యవసాయ పథకం అమల్లోకి రావటం, ఈ ప్రాంత ప్రజల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక పురోభివృద్ధికి దోహదపడింది.

భూములు ఎక్కువ సాగులోకి రావటంమూలంగా ఉత్పత్తి పెరగడంతో పాటుగా పేద, మధ్యతరగతి ప్రజల జీవనప్రమాణం గతంకంటే పెరిగింది. ఇది నూతన పురోగామి భావాలకు బాటలువేసింది. అనేకమంది ఒకమేరకు చదువులు చదువుకోగల్గటం, కొంతమేరకు ప్రభుత్వ ఉద్యోగాలు పొందగల్గటం సాధ్యపడింది. ఇది అనేక సంస్కరణలకోసం, భూస్వామ్య పెత్తందార్ల దోపిడీ పీడనలనుండి విముక్తికోసం పోరాటాలకు, ఉద్యమాలకు మార్గం చూపింది. గురజాడ, రామ్మోహన్ రాయ్, వీరేశలింగం తదితర సంస్కరణ ఉద్యమాల ప్రభావం ఇక్కడ బలంగా వీచింది. గ్రామీణ భూస్వామ్య, పెత్తందారీ వర్గాల వ్యతిరేక పోరాటాలు సాగాయి.

ఇది గతంనుంచి గ్రామీణ ప్రాంతాలలో దళితులపై సాగుతున్న దోపిడీ దౌర్జన్యాలను ఒకమేరకు తగ్గించగల్గింది. కానీ ఆ తర్వాతకాలంలో ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ (కారణాలు వేరైనప్పటికీ) పునాది వర్గాల ప్రజలపై పట్టు కోల్పోతూ వచ్చింది. అప్పటివరకు వివిధ అభ్యుదయకర, ప్రగతిశీల శక్తుల వెనుక సంఘటితమైన దళితులు, ఇతర పేదలు పాలకవర్గపార్టీలవైపు మళ్ళారు. సరైన పద్ధతిలో, దళితులు ఇతర పేద వర్గాలను కదిలించటంలో ఏర్పడిన గ్యాప్‌ను పాలకవర్గాలు చక్కగా వినియోగించుకున్నాయి. అనేక రకాలైన భ్రమలు చూపాయి. దళితులలోని ఒక సెక్షనును తమ వెనుక నిలబెట్టుకొని ఓట్ల బ్యాంకును పదిలపర్చుకున్నాయి. అయితే ఇది దళితుల సమస్యలను ఏ మాత్రం పరిష్కరించకపోగా మరింత తీవ్రం చేసింది.

గ్రామీణ ప్రాంతాలలో అగ్రకుల దురహంకారులు, భూస్వామ్య పెత్తందారుల ప్రాబల్యం, దోపిడి గణనీయంగా పెరిగింది. దళితులు, పేదల్లోని ఒక సెక్షను భ్రమల్లో కూరుకుపోవడం, మిగిలిన వారిని పోరాటమార్గంలో నడిపించేవారు లేకపోవడం భూస్వామ్య, పెత్తందారులకు ఆటవిడుపైంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితిని ఆసరాచేసుకొని దళితుల, ఇతర పేద వర్గాల ప్రజానీకాన్ని అనేకరూపాల్లో మరింత దోపిడీ, అణచివేతలకు గురిచేశారు. కులంపేరుతో అగ్రకులాల్లో పేదవర్గాల ప్రజానీకాన్ని తమ వెనుక నిలబెట్టుకొని దళిత, ఇతర వెనుకబడిన వర్గాలపై ప్రయోగిస్తూ తమ ప్రయోజనాల్ని నెరవేర్చుకుంటూ వస్తున్నారు. మరొకవైపున ప్రభుత్వ పాలకవర్గాలు, కులం, మతం పేరుతో పేదప్రజల్ని విభజిస్తూ తమ పాలనను సాగిస్తున్నారు.

ఈ క్రమంలోనే దళితులు సంఘటితపడ్తు వచ్చారు. గతకాలపు పోరాటాల ఫలితంగా విద్యా, ఉద్యోగాలలో ఏదో ఒకమేరకు ప్రవేశించగల్గారు. తలెత్తుకొని ఆత్మ గౌరవంతో జీవించాలనే కాంక్షను, దోపిడీ వ్యతిరేక చైతన్యం కలిగించే పార్టీల, ఇతర దళిత ఉద్యమాల ప్రేరణతో పొందుతున్నారు. గ్రామీణ పేదలు, దళితులు అణిగిమణిగి వుంటూ, తమ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బతకాలని కోరుకునే భూస్వామ్య, అగ్రకుల దురహంకారం దళితులలో పెరుగుతున్న ఈ ఆత్మ గౌరవ కాంక్షను హరాయించుకోలేక పోతున్నది. లేదా తప్పని పరిస్థితుల్లో దిగమింగుకుని అగణద్రొక్కడానికి అవకాశం కోసం కాచుకొని ఉంటున్నది. పాదిరికుప్పంలో ఓట్లు వేయలేదనే కారణంతో కావచ్చు, నీరుకొండలో బస్సులో సీట్ల తగాదాకావచ్చు, కారం

చేడు చెరువువద్ద తగాదాకావచ్చు....ఇవన్నీ తరతరాలుగా అణచబడుతున్న దళితులు, భూస్వామ్య అగ్రకుల దురహంకారాన్ని ప్రశ్నించినదాన్ని అడ్డం పెట్టుకుని జరుపుతున్న హత్యాకాండలని స్పష్టమౌతున్నది. కోస్తా ప్రాంతంలో జరుగుతున్న హత్యాకాండను ఈ ఆర్థిక, సాంఘిక నేపథ్యంలో పరిశీలించాలి.

**చుండూరు భౌగోళిక, ఆర్థిక, సాంఘిక, రాజకీయ విద్యావిషయక సాంస్కృతిక పరిస్థితులు :**

మండల కేంద్రమైన చుండూరు గ్రామం గుంటూరు జిల్లాలో తెనాలికి దగ్గరలో ఉంది. తెనాలి నుండి మద్రాసు వెళ్ళే రైలు మార్గంలో 20 కి.మీ దూరంలో ఈ గ్రామం వుంది. చుండూరు గ్రామ వైశాల్యం....చ॥కి॥మీ. చుండూరుకు నలువైపులా దక్షిణాన మోదుకూరు, ఉత్తరాన వలివేరు, తూర్పున ఆలపాడు, పశ్చిమాన పెల్లటూరు హద్దులుగా ఉన్నాయి. చుండూరులో కృష్ణా పంటకాల్వల ఆధారంగా మాగాణిలో రెండు పంటలు పండుతాయి. ప్రధానంగా మాగాణి వరి పంట పండిస్తారు. మెట్టపంటలుగా పసుపు ప్రధానంగా ఉంది. అరటి తోటల పెంపకం సాగుతున్నది.

చుండూరు గ్రామ జనాభా మొత్తం 5వేల మంది. ఇందులో షెడ్యూలు కులాలకు చెందినవారు 2000, షెడ్యూలు జాతులు 350 మంది ఉన్నారు. ఇతరులు ప్రధానంగా అగ్రకులాలు రెడ్డి, కాపుకులాలకు చెందినవారు, 2500 వరకూ వుంటారు. వైశ్యులు, బ్రాహ్మణులు అతి కొద్ది కుటుంబాలు మాత్రమే ఉన్నాయి.

ఇందులో దళితులందరికీ కలిపి స్వంత భూమి 50 ఎకరాలు మాత్రమే. కాగా అగ్రకులాలకు చెందిన వారిలో 25 ఎకరాలున్నవారు షుమారు 50 కుటుంబాలున్నాయి. షుమారుగా ఎకరం 70, 80 వేల రూపాయలు చేస్తుంది. 25 ఎకరాలకు మించినవారు లేదు. 5, 10 ఎకరాల మధ్య భూమి కలిగినవారే గ్రామంలో ఎక్కువ మంది ఉన్నారు. వ్యవసాయం ప్రధానంగా మాగాణి భూముల్ని అగ్రకులాలు దళితులకు కౌలుకు ఇచ్చారు. మెట్ట పంట, పసుపు, అరటితోటలను అగ్రకులాలకు చెందిన వారే చేసుకుంటారు. వ్యవసాయంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులనే సాగుచేస్తున్నారు. దళితులు కౌలుకు తీసుకున్న భూములు మొత్తం భూమిలో 300 ఎకరాలు పల్లెలోని 50 కుటుంబాలు కౌలుకు సాగు చేస్తున్నాయి.

చుండూరు గ్రామంలో ఇరుపక్షాలు మెజారిటీగా కాంగ్రెస్ వైపే వుంటాయి.

ఆ గ్రామంలో రెడ్లు, కాపులకు మధ్య ఘర్షణలు ఉన్న దాఖలాలు లేవు – కారంచేడు సంఘటన జరిగిన తర్వాత ఈ ప్రాంతాలలోని దళితులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. MPP అధ్యక్షుడిగా దళితుడు రిజర్వ్‌డ్ మండల కేంద్రంనుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నుకోబడ్డాడు. అగ్రకులాల మద్దత్తుతో గెలుపొందాడు.

చుండూరు గ్రామానికి ఆనుకుని ఉన్న పల్లెలో మాల, మాదిగ కులాలవారున్నారు. వీరు కలిసిమెలిసి జీవిస్తున్నారు. వీరిలో మెజారిటీ జనాభా వ్యవసాయ కూలీలుగా ఉండగా ఆ తర్వాత స్థానం కౌలుదార్లకు ఉంటుంది. షుమారు 60 కుటుంబాలు పల్లెనుండి రైల్వే ఉద్యోగాలలో ఉన్నారు. దాదాపు సగం కుటుంబాలు పాడి పరిశ్రమతో జీవిస్తున్నారు. అలాగే షుమారు 30 మంది నిడుబ్రోలు వెళ్ళివస్తూ చేనేత పనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

చుండూరులో పాలకేంద్రంగానీ, గ్రంథాలయంగానీ, బస్ షెల్టర్‌గాని, పశువుల వైద్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకాని లేవు. ఒక సినిమా హాల్ వుంది. మొత్తంగా గ్రామంలోని యువతపై దురలవాట్ల ప్రభావం వుంది. ఊర్లో బ్రాందీషాపులు వున్నాయి. శివరాత్రి, దసరా తదితర పండుగుల సందర్భంలో నాటకాలు వేయటం, ప్రభలు కట్టించటం వంటి రూపాల్లో వేల రూపాయలు ఖర్చుచేసే పరిస్థితి వుంది.

చుండూరు గ్రామ మొత్తం జనాభాలో చదువుకున్నవారు 2000 మంది. ఒక హైస్కూలు మాత్రమే వుంది. కాలేజీ చదువులకు తెనాలి రావాలి. రిజర్వేషన్ సౌకర్యాన్ని ఉపయోగించుకుని ఒక మేరకు దళితులు విద్యా-ఉద్యోగావకాశాలు పొందగల్గారు.

చుండూరు గ్రామంలోని రెడ్ల కుటుంబాలకు ప్రక్కనే ఉన్న మున్నంగివారి పాలెం, మోదుకూరులలో దగ్గరి బంధుత్వాలు ఉన్నాయి. మున్నంగివారి పాలెంను తుంగభద్ర డ్రైన్ చుండూరు నుండి వేరు చేస్తుంది. మోదుకూరు, మున్నంగివారి పాలెం రెండూ మేజర్ పంచాయితీలు.

## చుండూరు డైరీ, 1991

**జులై - 7 :**

గ్రామంలో ఉన్న సినిమాహాల్‌లో స్వల్పఘటన జరిగింది. నాగపూర్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సు చదువుతున్న దళిత యువకుడు గోవతోట రవి కాలు

పొరపాటున ముందుసీట్లో కూర్చుని వున్న మర్రి శ్రీనివాసరెడ్డికి తగిలింది. రవి దానిపై పొరపాటయిందని చెప్పినా రెడ్డి యువకుడు రవిని కులంపేరుతో దూషించగా అక్కడున్న మాల యువకులు ఇద్దరు, రవికి శ్రీనివాసరెడ్డికి స్వల్పఘర్షణ జరిగింది. రెడ్ల యువకుడి మొహం కందింది.

జులై - 8 :

ఇది జరిగిన తర్వాత గోవతోట రవి ఊరు వదిలి ఒంగోలు వెళ్ళిపోయాడు. మరుసటి రోజు మధ్యాహ్నం రవి తండ్రి [ఈయన పక్కనేవున్న మున్నంగివారి పాలెం గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు]ని రెడ్డి కులస్తుల గుంపు ఊళ్ళోని శివాలయం సెంటర్‌లో పట్టుకొని కొట్టారు. ఒక రెడ్ల హోటల్‌లో బంధించారు. వాళ్ళ అబ్బాయి ఆచూకీ చెప్పమని బెదిరించారు. భయపడిన రవి తండ్రి తన కొడుకు మద్రాసు నుంచి హౌరా వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైల్లో ఒంగోలునుంచి వస్తాడని చెప్పాడు. ఈ దాడికి మోదుగుల మల్లిఖార్జునరెడ్డి, సోమిరెడ్డి, పోలూరు ప్రసాదరెడ్డి, గొర్రెపాటి ప్రసాద్‌రెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి నాయకత్వం వహించారు. తన కొడుకు ఆచూకీ చెప్పినప్పటికీ కులోన్మాదులు రవి తండ్రిని వదల్లేదు. చుండూరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వచ్చి విడిపించుకెళ్ళాడు. సాయంత్రం ఐదుగంటలకు చుండూరు రైల్వే స్టేషన్లో ఆగిన హౌరా ఎక్స్‌ప్రెస్ నుంచి గోవతోట రవి దిగగానే మాలపల్లి కుర్రవాడొకరు అతన్ని కలిసి, రాత్రి సినిమాహాల్లో జరిగిన ఘటన గురించి పోలీసులు అరెస్టు చేయవచ్చునని, రెడ్లు దాడిచేయనున్నారని హెచ్చరించాడు. ఈ హెచ్చరిక వల్ల భయపడిన రవి చుండూరు గ్రామానికి రాకుండా పొలాల్లో అడ్డంగా నడుస్తూ మరో పక్క గ్రామంపైపు పోసాగాడు. ఈ విషయం పసిగట్టిన రెడ్లు షుమారు 100 మంది మారణాయుధాలతో అతన్ని తరిమారు. పక్కగ్రామం పెదగాజులపల్లి దళిత వాడలోకి ప్రవేశించి రవి చొక్కా, ప్యాంటు విప్పి ఒక ఇంటిలో బుట్టకింద వాటిని దాచి, అర్ధనగ్నంగా చీకట్లో ఇంటి మచ్చుమీద పడుకున్నాడు. ఉన్మాదులైన రెడ్లు ఆ దళితవాడమీద దాడిచేసి ఇల్లిల్లు వెతికారు. బంగారుగొలుసు దొంగిలించి వస్తున్న దొంగ అని అబద్ధాలు చెప్పి దళితవాడను గాలించారు. రవిని పట్టుకున్నారు. అతన్ని కొట్టుకుంటూ నడిగడ్డిపాలెం డొంకలోకి తీసుకెళ్ళి బాగా కొట్టారు. తలపై బలమైన రక్తపుగాయం అయింది. రాత్రి షుమారు 10 గంటల సమయంలో మండలి రెవిన్యూ కార్యాలయం వద్దకు తెచ్చారు. అక్కడ మళ్ళీ కొట్టి బలవంతంగా మద్యం నోట్లో

పోశారు. తర్వాత పోలీస్ స్టేషన్లో అప్పగించారు. తెనాలి రూరల్ సి.ఐ. చుండూరు ఎస్.ఐ. అతన్ని అరెస్టుచేసి జైలుకు పంపారు. హౌరా ఎక్స్ప్రెస్‌కు దిగిన రవిని రెడ్డికులస్తులు మారణాయుధాలతో తరుముతున్న విషయం తెలిసి అతన్ని కాపాడేందుకు చుండూరు మాలపల్లి నుంచి బయల్దేరిన 30 మంది మాల యువకులను చుండూరు పోలీస్ ఎస్. ఐ. వెనక్కు తరిమేశాడు. రెడ్లపై ఫిర్యాదు చేసేందుకు గోవతోట రవి, అతని తండ్రి భయపడ్డారు. ఎస్. ఐ. నేరాన్ని నమోదు చేయలేదు.

## జులై - 9 :

గ్రామంలో రెడ్లు, నాయుళ్ళ వత్తాసుతో ఒక కమిటీగా ఏర్పడ్డారు. గ్రామంలోని మాలకులస్తులను సాంఘిక బహిష్కరణ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కమిటీకి మరి కొందరితోపాటు మోదుగుల సాంబిరెడ్డి (గ్రామ సర్పంచ్), గుదేటి చిన బ్రహ్మారెడ్డి (సహకార సంఘాధ్యక్షుడు), డయ్యూరు చిన వెంకటరెడ్డి నాయకత్వం వహించారు. మాలలను పొలం పనికి రానీయవద్దని, ఏ హోటల్‌కూ రానీయ వద్దనీ, సరుకులు అమ్మరాదని నిషేధాలు విధించారు. గ్రామంలో అన్ని అగ్రకులాల నుంచి కొందరు మాలలు కౌలుకు తీసుకున్న పొలాల్ని వెనక్కు తీసుకోవాలని, కౌలు కాంట్రాక్టులన్నీ రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. గోవతోట రవి కుటుంబంతో మాట్లాడితే రూ. 25/- జరిమానా విధించాలని మాల కులస్తులు నిర్ణయించారు. తీవ్రగాయాలైనా రెడ్లపై ఫిర్యాదు చేసేందుకు గోవతోట రవి అతని తండ్రి నిరాకరించడాన్ని నిరశిస్తూ వారీ నిర్ణయం తీసుకున్నారు.

## జులై - 12 :

మాలలపై రెడ్ల నాయకత్వంలో సాంఘిక బహిష్కరణవల్ల వారు తీవ్ర ఇబ్బందులకు లోనౌతూ వున్నారు. గ్రామంలో పనులు చేయనీయకపోవడంతో మాల వ్యవసాయ కూలీలు చుట్టు పక్కల గ్రామాల్లో కూలి పనులకు వెళ్ళివస్తున్నారు. అనేకమంది గ్రామం విడిచి వెళ్ళిపోయారు. కౌలుపొలాలు గుంజుకోబడ్డాయి. కౌలు డబ్బును వడ్డీతోసహా రెడ్లు, ఇతర అగ్రకులస్తులు తిరిగి ఇచ్చేశారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొనివుంది. గ్రామంలో 144వ సెక్షన్ విధించారు. తెనాలి రూరల్ సి. ఐ. చుండూరు ఎస్. ఐ. మరో ఇద్దరు ఎస్.ఐ.లు సాయుధ రిజర్వు పోలీసులు బందోబస్తుతో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాత్రి 10 గంటలకు దిండిపాలెం, వలివేరు, మోదుకూరు, ఎల్లటూరు, మంచాల నుంచి వందలాది మంది రెడ్లు, గ్రామం

లోని రెడ్ల నాయకత్వంలో మాలపల్లెపై దాడికి వెళ్ళారు. రాళ్ళు విసిరారు. మాలలు ఆత్మరక్షణకై నడుంకట్టారు. రెడ్లతో తలపడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి గాలిలోకి ఒక రౌండు కాల్పులు జరిపారు. ఇరుపక్షాలపై లాఠీచార్జీ చేసి చెదరగొట్టారు.

**జులై - 13 :**

ఉదయం 11 గంటలకు రాజీపెడతానని చెప్పి సి. ఐ. మాల కులస్తులను రామిరెడ్డి దొడ్లోకి రమ్మని చెప్పాడు. వంద మంది మాలలు వెళ్ళారు. వారిలో వివిధ వయస్సులవారిని యువకులను మొత్తం 18 మందిని ఏరి అరెస్టుచేసి మినీలారీలో తెనాలి తీసుకువెళ్ళాడు. రెడ్లనుకూడా అదే సంఖ్యలో అరెస్టు చేసి తెనాలి తీసుకెళ్ళారు. క్రైం నెం 54/91, క్రైం నెం 55/91గా రెడ్లపై, మాలలపై రెండు కేసులు నమోదు చేశారు. ఆయుధాలు ధరించి హత్యాప్రయత్నాలు చేశారని ప్రాథమిక సమాచార నివేదికలో పేర్కొన్నారు. తర్వాత రెండు కేసులలోని ఆ అభియోగాలు ఉపసంహరించి బెయిల్ వచ్చే దెబ్బలాట కేసులుగా మార్చారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లింప జేస్తున్నారంటూ ఇరుపక్షాలపై తెనాలి ఆర్. డి. వో వద్ద "బైండోవర్" కేసులు కూడా పెట్టారు. ఇదే రోజు మధ్యాహ్నం పోలీసులు దళితవాడమీద దాడిచేసి ఇళ్ళమీద పడి మాలలను తరిమికొట్టారు. రెండ్రోజులు దళితులు ఇళ్ళకు రాలేదు. మరికొందరు గ్రామం విడిచి పారిపోయారు.

**జులై - 29 :**

గ్రామంలో ఉద్రిక్తత ఉంది. మాల కులస్తులు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. సాంఘిక బహిష్కరణకు గురౌతూ ఉన్నారు. అయినప్పటికీ జులై 13 నుంచి, ఎలాంటి ఘటనలు జరుగలేదని 144 వ సెక్షన్ క్రింద నిషేధాజ్ఞలు ఎత్తివేసి, పోలీసు బందోబస్తు ఉపసంహరించారు.

**ఆగస్టు - 4 :**

గ్రామంలో దళితులు భయకంపితులై ఉన్నారు- సాంఘిక బహిష్కరణ కొనసాగుతూ ఉంది- పోలీసు బందోబస్తు లేదు- పంచాయితీ గడ్డి పాటలు నిర్వహించింది. అన్ని పాటల్లోనూ రెడ్లు పాడుకున్నారు. ఆనవాయితీగా ప్రతి ఏటా దళితులు గొడ్లు మేపుకునేందుకు విడిచిపెట్టే డొంకలను, కాలవకట్టను కూడా వారికి వదల్లేదు. మాలపల్లె పక్కనున్న కాలవకట్ట కూడా వారికి ఇవ్వలేదు.

ఈ రోజు మధ్యాహ్నం ప్రకాశం అనే మాల యువకుడు మండల రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్తుండగా వీరశేఖరరెడ్డి నాయకత్వంలో రెడ్ల యువకులు కొందరు అతన్ని "ఇట్రారా మాల లంజకొడకా" అని పిల్చి కవ్వించి కొట్టబోయారు. అతను తప్పించుకొని పల్లెకు రాగలిగాడు. పల్లె దగ్గరకు రెడ్ల యువకులు వచ్చి గుర్రుగా చూస్తూ తిరిగి వెళ్ళారు.

10 వ తరగతి చదువుతున్న మాల కులానికి చెందిన విజయపాల్ గ్రామంలో బోసుబొమ్మ సెంటర్ వద్ద ఉండగా తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి నాయకత్వంలో రెడ్లు అతనిపైకివెళ్ళి కత్తితో పొడవబోయారు. విజయపాల్ ఆ కత్తిని లాక్కొనగా చేతికి గాయం అయింది. ఒక రెడ్ల యువతిని రాసుకుంటూ వెళ్ళాడని విజయపాల్ పై ఆరోపణ. గాయపడ్డ విజయపాల్ ని తీసుకొని దళితులు పోలీస్ స్టేషన్ కు వెళ్ళారు. అదే సమయంలో వందమందికి పైగా రెడ్లు స్టేషన్ వద్దకు వెళ్ళి విజయపాల్ ముగ్గురు రెడ్ల యువతులను సినిమాహాల్ వద్ద వేధించాడని అతనిపై కేసు నమోదు చేయించారు. హత్యాప్రయత్నం ఫలితంగా రెడ్లు గాయపర్చిన విజయపాల్ ను పోలీసు ఎస్.ఐ అరెస్టు చేశాడు. హత్యాప్రయత్నం చేసిన రెడ్లపై కేసు లేదు.

**ఆగస్టు - 5 :**

బహిర్భూమికి వెళ్ళినచోట ఒక కాపు కులస్తుడికి, ఇద్దరు మాల బాలురికి మధ్య గొడవ జరిగింది. కాపు కులస్తుడు మాల యువకుడిని కులం పేరుతో తిట్టడంతో చిన్నపాటి ఘర్షణ జరిగింది.

మధ్యాహ్నం మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్తున్న చౌకడిపో డీలర్ గోళ్ళమూడి యాకోబుపై రెడ్లు దాడిచేశారు. కత్తితో గాయపర్చారు. తర్వాత కాపులు రాళ్ళు, సోడాబుడ్లతో దళితులపై మధ్యాహ్నం తర్వాత తలపడ్డారు. పోలీసుల రంగ ప్రవేశంతో అప్పటికి సద్దుమణిగింది. రాత్రికల్లా 50 మందికి పైగా సాయుధ రిజర్వు పోలీసులు వచ్చారు. 144 వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు తిరిగి జారీ అయ్యాయి. వివిధ పోలీసు స్టేషన్లకు చెందిన 7 గురు ఎస్.ఐ.లు, తెనాలి రూరల్ సి.ఐ. T.V. శాయిబాబు గ్రామంలో బందోబస్తు ఉన్నారు. మాలపల్లి నుంచి అగ్రకుల ప్రాంతాన్ని వేరుచేసే రోడ్డు మీదే పోలీసు పికెట్ పెట్టారు. మొత్తం గ్రామంలో పది పోలీసు పికెట్లు పెట్టారు. పల్లె యాకోబుపై దాడిచేసిన వారిని తర్వాత దళితులపై దాడికి దిగిన వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు ఏ మాత్రం ప్రయత్నించలేదు.

ఆగస్టు - 6 :

చుండూరు, మోదుకూరు, మున్నంగివారిపాలెం, దిండిపాలెం, వలివేరు, వెల్లటూరు, మంచాల, చేబ్రోలు గ్రామలకు చెందిన రెడ్డి కులస్తులు, కాపులు వందలాది మంది మారణాయుధాలతో దాడికి ట్రాక్టర్లలో, స్కూటర్లలో సిద్ధమయ్యారు. అగ్ర కులోన్మాదంతో ఊగిపోయి దళితులకు జీవితంలో మర్చిపోలేని 'గుణపాఠం' నేర్పాలనుకున్నారు. పోలీసులు వారి గుణపాఠానికి సహకరించే ఏర్పాట్లు జరిగాయి. పథకం ప్రకారం ఉదయం 11 గంటలకు వేమూరు ఎస్.ఐ. మదార్‌వలి కొందరు పోలీసులు మాలపల్లిపై దాడిచేశారు. గతంలో నమోదైన కేసుల్లో ముద్దాయిల కోసం వచ్చినట్లుగా నాటకమాడి వాడలోని దళితులందరినీ పొలాల్లోకి తరిమేశారు. స్త్రీలు మాత్రం ఇళ్ళల్లోనే ఉండిపోయారు. మగవారంతా పోలీసులకు, భయపడి పొలాల మీదుగా చెల్లాచెదురుగా పరుగెత్తారు. కొందరు పోలీసులు రెడ్లు కలిసి ట్రాక్టర్లపై పారిపోతున్న వారిని వెంట తరిమారు. కొంతదూరం వెళ్ళిన తర్వాత ఈ కులోన్మాదులకు దళితులను అప్పజెప్పి పోలీసులు వెనుదిరిగారు. ట్రాక్టర్లపై, స్కూటర్లపై దళితులను వెంటాడుతూ, మధ్యాహ్నం 12 గంటలనుంచి షుమారు నాలుగైదు గంటల పాటు కులోన్మాదులు చుండూరు చుట్టుపక్కల పొలాల్లో, రోడ్లమీద, రైల్వే ట్రాక్‌మీద మోదుకూరులో మారణకాండ నిర్వహించారు. చుండూరు ఊరికి నాలుగు ఫర్లాంగుల దూరంలోనే ముగ్గురు దళితులను వధించి తుంగభద్ర డ్రైన్‌లో వేశారు. పరిగెత్తి మోదుకూరు గ్రామంవైపు వెళ్ళిన ఒక దళితుడు కూడా బతకలేదంటే అతిశయోక్తి కాదు. పథకం ప్రకారం కాచుకున్న మోదుకూరు రెడ్లు తమ గ్రామంవైపు వచ్చిన వారిని వచ్చినట్టు నరికారు. తాపీగా బస్తాలు కుట్టి పంటకాల్వలలో, తుంగభద్ర డ్రైన్‌లో వేశారు. మోదుకూరు మీదుగా తులిమెళ్ళ వెళ్ళే బస్సులో 40 మంది రెడ్లు, తెలగాలు మారణాయుధాలు ధరించి RTC బస్ టాప్‌మీదకూడా ఎక్కి పొలాల్లో దళితుల కోసం వేటాడారు. కనిపించిన వాళ్ళను గొడ్డళ్ళతో నరికారు. బోరుగడ్డ సాంబయ్య (50) తీవ్ర గాయం అయింది. పొంతగాని నర్సింహం (60)ను కత్తులతో పొడిచారు. మంద్రు రమేష్ దేవరపల్లి జయరాజ్‌ను కత్తులతో నరకడం చూశాడు. దనరాజ్‌ను పట్టుకొని భుజంమీద వేసుకొని కుంటివాడైన మల్లిఖార్జున రెడ్డితో నరికించి చంపించేందుకు తీసుకెళ్తుండగా అతను ఒక కాలువ అడ్డంరాగా అక్కడ దించినప్పుడు కాలువలో దూకి ఈదుకుంటూ తప్పించుకున్నాడు. గ్రామం

లోని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడుకూడా కాలువలో దూకి ఈది ప్రాణాలు దక్కించుకున్నారు. అనేకమందికి గాయాలయ్యాయి. దళితులు భీతిల్లి చెల్లాచెదురయ్యారు.

అగ్రకులస్తులు మోదుకూరులో తాపీగా శవాలను గోతాలలో కుట్టి ట్రాక్టర్లలో తీసుకెళ్ళి పంట కాలువల్లో తుంగభద్ర డ్రైన్‌లో వేశారు. గొర్రెపాటి సాంబిరెడ్డి ట్రాక్టర్లో శవాలను తోలారు. ఈ మారణకాండకు మోదుగుల మల్లిఖార్జునరెడ్డి, చుండూరు సర్పంచ్ మోదుగుల సాంబిరెడ్డి, పుయూరు సత్యనారాయణరెడ్డి, పోతూరు ప్రసాద్‌రెడ్డి, పెంకట్రావు తిప్పిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పఠాల వెంకటనారాయణ నాయకత్వం వహించారు.

అదే సమయంలో రెడ్లు, నాయుళ్ళు తమ వారి వెంటపడ్డారని చంపుతారేమో కాస్త వెళ్ళి ఆదుకోమని దళిత మహిళలు గ్రామంలో ఉన్న పోలీసులను అభ్యర్థించగా వారు ఏ మాత్రం వినిపించుకోలేదు. రెడ్లు ఏమీ చేయరని చెప్పారు. ఊరికి దగ్గర్లో ఉన్న మల్లె తోటలో అరుపులు వినిపించగా [ఆ తర్వాత అక్కడ మూడు శవాలు దొరికాయి] పోలీసులను వెళ్ళి తమవారిని రక్షించమని దళితమహిళలు అభ్యర్థించగా పోలీసులు 'పొలం పని చేసుకుంటున్న వాళ్ళు నీళ్ళ దగ్గర గొడవపడుతూ వుండి వుంటార్లే' అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

మారణకాండ జరుగుతున్న సమయంలో రెడ్డి కులస్తులైన మహిళలు కొందరు చుండూరు పోలీసుస్టేషన్‌కు వెళ్ళి మోదుకూరు గ్రామంలో పాఠశాలకు తమ పిల్లలు వెళ్ళి వున్నారని అటువేపుగా పారిపోయిన దళితులు తమ పిల్లలను ఏమైనా చేస్తారేమోనని తమకు భయంగా వుందని చెప్పడంతో సి. ఐ. శాయిబాబా ఒక ట్రాక్టర్ తెప్పించి అమృతలూరు ఎస్. ఐ. వీరయ్యను అందులో ఎక్కించి, సురక్షితంగా తెమ్మని చెప్పాడు. పిల్లల తాలూకు అగ్రకులస్తులు, ఎస్.ఐ. వీరయ్యతో ట్రాక్టర్‌పై 'వీరోచితంగా' మధ్యాహ్నం మూడు గంటలకు వెళ్ళి మోదుకూరునుంచి అగ్రకులస్తుల పిల్లలను తీసుకువచ్చారు.

ఇదే సమయంలో తెనాలిలో పత్రికా విలేఖర్లతో మాట్లాడుతూ డి. ఎస్. పి. రాయలయ్య చుండూరులో స్వల్ప ఘటనలు ఈ రోజూ, ముందురోజు జరిగినట్టు, గుంటూరు నుంచి రిజర్వు పోలీసులను, ఏడుగురు ఎస్. ఐ. లను, సి. ఐ.ని బందోబస్తుకు నియమించినట్టు, పరిస్థితి పూర్తిగా అదుపులో వున్నట్టూ ప్రకటించారు.

తెనాలికి చేరుకున్న కొందరు దళితులు ఆర్. డి. వో. కు మారణకాండపై రాత్రికి ఫిర్యాదు చేసారు.

## ఆగస్టు - 7 :

చుండూరులో స్వల్పఘర్షణ జరిగిందని, అదనపు పోలీసు బలగాలు రప్పించబడ్డాయని, సి.ఐ. ఏడుగురు ఎస్.ఐలు, సాయుధ రిజర్వు పోలీసుల బందోబస్తులో పరిస్థితి అదుపులో వుందని నిన్న డి.ఎస్.పి. చేసిన ప్రకటన ఈరోజు దినపత్రికల్లో అచ్చయింది.

నిన్నటి మారణకాండలో చనిపోయినవారి శవాలు గోతాల్లో, మల్లెతోటల్లో, మురుగు కాల్వల్లో, పంట కాల్వల్లో పడే వున్నాయి.

భీతిల్లి చెల్లాచెదురై తప్పించుకున్న చుండూరు దళితుల్లో కొందరు ఐతానగర్‌కు చేరుకున్నారు. గాయపడిన యువకుడు పంతగాని జక్రయ్య మొహంనిండా చైను దెబ్బలు, తొంటిమీద దెబ్బలతో తెనాలి ప్రభుత్వాసుపత్రిలో చేరాడు.

బాధితులు తమవారిని చంపడం తాము చూశామని చెప్పినప్పటికీ, ఎవరూ చనిపోలేదని, అంతా పుకారు మాత్రమేనని డి.ఎస్.పి రాయలయ్య ఈరోజు సాయంత్రం వరకూ బుకాయిస్తూనే వున్నాడు.

పోలీసులు శవాల కోసం ఏ మాత్రం గాలింపు చర్యలు జరపలేదు. దళిత స్త్రీలు, పిల్లలు, వయో వృద్ధులే కాల్వల వెంట, చేలవెంట వెతికారు. అలా మోదుకూరు వెళ్ళిన దళితులను రెడ్లు తమ గ్రామ పరిసరాల్లో వెతకనీయకుండా వారిని బెదిరించి పంపారు. చుండూరు గ్రామానికి కేవలం 4 ఫర్లాంగుల దూరంలో తుంగభద్ర మురుగు కాల్వపక్క మల్లెతోటలో మూడు శవాలు కనిపించాయి. జాలాది మత్తయ్య, జాలాది ఇమ్మాన్యుయేల్, మల్లెల సుబ్బారావుగా దళితులు గుర్తించారు. ఈ విషయం తెల్సిన తర్వాతే పోలీసు యంత్రాంగంలో కనీసమయిన చలనం కనిపించింది.

## ఆగస్టు - 8 :

పోలీసులు శవాల కోసం గాలింపు చర్యలు ఇంకా ప్రారంభించలేదు. దళితులు గాలించి మరికొన్ని శవాలను చూపెట్టారు. మోదుకూరు గ్రామంలో తుంగభద్ర మురుగుకాల్వలో గోనె సంచిలో అంగలకుదురు రాజమోహన్ (మాదిగ కులస్తుడు,

మాలవాడలో నివశిస్తున్నాడు. దాడి జరిగిన సమయంలో పారిపోయి హతుడయ్యాడు) శవం, మోదుకూరు రైల్వేస్టేషన్ సమీపంలో తుంగభద్రసైడ్ ఛానల్ (పంటకాల్వ)లో గోనెసంచిలో జాలాది ఇస్సాక్ శవం, మోదుకూరు-అలపాడు డొంక సమీపంలో 1 వ నెంబరు బ్రాంచి కాల్వలో మంద్రు రమేష్ శవం, మోదుకూరు సమీపంలో పంట కాల్వ బ్రాంచిలో ఇంటూరు లాకువద్ద సంకురు సంసోను, దేవరపల్లి జయరాజ్ శవాలను వెలికితీశారు.

[ఇప్పటివరకు మొత్తం 8 మంది శవాలు కనుగొన్నారు. మరో 14 మంది గల్లంతు అయ్యారని భావిస్తున్నారు. అలా గల్లంతయినవారిలో ఐదుగురు కనిపించారని గుంటూరు రేంజి డి.ఐ.జి. ప్రకటించారు.]

## నిజ నిర్ధారణ కమిటీ నిర్ధారణలు

1) చుండూరు మారణకాండ అగ్రవర్ణ దురహంకారులకు, దళితులకు మధ్య తరతరాల వర్గ వైషమ్యాలుఫలితం. రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా జాలి పడి సాంఘిక చైతన్యంతో ఆత్మగౌరవంతో బతికే ప్రయత్నంచేస్తున్న దళితులకు 'గుణపాఠం' నేర్పి, వారిని అణిచివేయాలని అగ్రవర్ణ దురహంకార్లు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. గ్రామంలోని వెయ్యిమంది, వెయ్యిమందికి పైగా మాల కులస్తుల్లో 150 మంది దాకా వివిధ ప్రభుత్వోద్యోగాల్లో స్థిరపడ్డారు. సుమారు 20 మంది వరకూ గ్రాడ్యుయేషన్ వరకూ చదవడం, 13మంది వరకూ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు దాకా చదివారు. రెండు చౌక దుకాణాలు రిజర్వేషన్ ఫలితంగా ఎస్.సి.లకు ఇవ్వబడ్డాయి. కొందరు ఎస్.సిలు అగ్రవర్ణ భూములను కౌలుకు తీసుకున్నారు. గతంలో ఒక ఎస్. సి. యువకుడు 1986లో రెడ్డి కులస్తుల అమ్మాయిని కులాంతర వివాహం చేసుకున్నాడు. తెల్లబట్టలు వేసుకొని యువకులు ఆత్మగౌరవంతో బతకడం ప్రారంభించారు. తమను కులంపేరుతో దూషించడాన్ని అడ్డుకొనడం ప్రారంభించారు. మాల పల్లికి చెందిన యువకులు అంబేద్కర్ యువజన సంఘంగా సంఘటితమై రాజకీయ చైతన్యం ప్రదర్శిస్తూ వచ్చారు. అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పారు. రెడ్ల గుప్పిట్లో వున్నప్పటికీ ఒక మాల యువకుడు యం. పి. పి అధ్యక్షుడిగా రిజర్వేషన్ కోటాలో ఎన్నికయ్యాడు. గ్రామంలో కాయిదా పాటలకు మాలలుకూడా

హాజరై పాడుకుంటున్నారు. ఈ వాస్తవాలు దళిత చైతన్యానికి సూచికలు కాగా, అగ్రవర్ణ దురహంకారం పడగవిప్పి వారిపై మృత్యునాట్యం చేసింది.

2) చుండూరు దళితులపై మారణహోమం అగ్రవర్ణస్తులు పోలీసు యంత్రాంగం కుట్రచేసిన ఫలితంగా జరిగింది. హంతకులు రెడ్లు-కాపులు కాంగ్రెస్-తెలుగు దేశం పార్టీలకు చెందినవారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో చుండూరు రెడ్లు-నాయుళ్ళు కాంగ్రెస్ పార్టీకి ఓటు చేయగా, పార్లమెంటు ఎన్నికల్లో రెడ్లు కాంగ్రెస్ పార్టీకి-నాయుళ్ళు తెలుగు దేశం పార్టీకి ఓట్లు వేశారు. మున్నంగివారి పాలెంనుంచి దాడిలో పాల్గొన్న రెడ్లు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు చెందినవారు కాగా, ఇతర గ్రామాలనుంచి ఈ దాడిలో పాల్గొన్న రెడ్లు కాంగ్రెస్ పార్టీవారు.

అగ్రవర్ణస్తుల మారణకాండను సుగమం చేసేందుకు అప్పటికే గ్రామంలో ఉన్న పోలీసు యంత్రాంగం కుట్రలో పాల్గొని పూర్తిగా సహకరించింది. ఏడుగురు ఎస్. ఐ.లు, తెనాలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్, యం. ఆర్. వో, 144 క్రింద నిషేదాజ్ఞలు, 10 పోలీసు పికెట్లుగా దాదాపు యాభై మంది సాయుధ పోలీసు బందోబస్తు ఉన్న నేపథ్యంలో ఈ దాడి జరిగింది. వేమూరి ఎస్. ఐ. మదార్‌వలి, కొందరు పోలీసులు ఒక పథకం ప్రకారం దళితవాడపై దాడిచేసి దళితులను తరిమి అగ్రవర్ణ రాబందులకు అప్పగించాడు. మిగిలిన సి.ఐ, ఎస్.ఐలు 30 గంటలవరకూ చోద్యం చూస్తూ వుండిపోయారు. దళితవాడకు అతి దగ్గరగా పోలీసుస్టేషన్ ఉంది. దళితవాడ వద్ద పోలీసు పికెట్ వుంది. పోలీసుస్టేషన్‌కు నాలుగు ఫర్లాంగుల దూరంలోపే మూడు శవాలు మల్లెతోటలో, పక్కనున్న తుంగభద్ర మురుగుకాల్వలో తర్వాత కనుగొన్నారు. కొన్ని గంటలపాటు, యథేచ్ఛగా దాడి జరిగింది. తమవాళ్ళ హాహాకారాలు వింటున్న దళిత స్త్రీలు, తమవాళ్ళను రక్షించేందుకు వెళ్ళమని పోలీసు యంత్రాంగాన్ని అభ్యర్థించి వారు వెళ్ళకపోగా ఏమి జరగడంలేదని చెప్పి మిన్నకుండి పోయారు. ట్రాక్టర్లలో ఎస్. ఐ మదార్‌వలి పోలీసులు కొందరు రెడ్లతో కలిసి తమను తరిమారని బాధితులు ముక్తకంఠంతో చెప్పారు. మారణహోమం జరుగుతూ ఒకవైపు శవాలను పంటకాలవల్లో దొర్లిస్తుండగా, సి. ఐ. ఆదేశాలమేరకు అమృతలూరు ఎస్. ఐ. వీరయ్య చుండూరునుంచి రెడ్లతోకలిసి ట్రాక్టర్‌లో మోదుకూరు వెళ్ళి అగ్రవర్ణస్తుల పిల్లలను అక్కడినుంచి సురక్షితంగా చేర్చడంలో

నిమగ్నమయ్యాడు. ఉన్నత స్థాయిలో పోలీసు అధికార్లు అగ్రవర్ణస్తులు చేసిన కుట్ర ఫలితంగా మారణకాండ జరిగిందని పై వాస్తవాలు నిర్ద్వంద్వంగా ప్రకటిస్తాయి. మారణకాండ జరిగిన 30 గంటలవరకూ ఏమీ జరగలేదని డి. ఎస్. పి స్థాయి పోలీసు అధికారి బుకాయింపు వారి కుమ్మక్కు ఎంతో నిస్సిగ్గుగా వుందో తెలియజేస్తుంది.

3) పోలీసుల, అగ్రకులస్తుల దాడినుంచి తప్పించుకునేందుకు చుండూరునుంచి మోదుకూరు పరిగెత్తిన దళితులెవరూ బతికి బట్టకట్టలేదు. అక్కడి రెడ్లు వచ్చిన వారిని వచ్చినట్లు హతమర్చారు. గోతాల్లో కుట్టి ట్రాక్టర్లలో తీసుకెళ్ళి శవాలను పంట కాలువల్లో దొర్లించారు. హతులైన దళితులలో ఎక్కువమంది మోదుకూరు గ్రామ పరిసరాల్లో శవాలుగా దొరికారు. మోదుకూరు రెడ్లకు ముందుగా పథకం తెలుసుకాబట్టే వారు కాచుకుని మారణకాండ నిర్వహించారు. కొందరి శవాలను గోతాలలో కుక్కి, తాపీగా కుట్టి కాలువల్లో వేశారు. మోదుకూరు పరిసరాల్లో ఐదు శవాలు దొరకగా, అందులో రెండు శవాలు గోతాల్లో కుక్కి వున్నాయి.

4) సంఘటన జరిగినప్పటినుంచి ఐదురోజులపాటు తయారయ్యేంతవరకూ శవాల గాలింపుకు పోలీస్ యంత్రాంగం ఏ చర్య తీసుకోలేదు. దళితులే పొలాల వెంట పంట కాలువల వెంట తిరుగుతూ శవాలకోసం గాలింపు జరిపి వాటిని కనుగొని సమాచారం అందించిన తర్వాతే అధికార యంత్రాంగం బయల్దేరి వెళ్ళి శవాలను స్వాధీనం చేసుకుంది. గజఈతగాళ్ళను తెప్పించినట్లు పత్రికల్లో ప్రకటించిన తర్వాత ఐదురోజులవరకూ గజఈతగాళ్ళను పిలిపించలేదు. ఆగస్టు 8వ తేదీ మధ్యాహ్నం వరకూ మోదుకూరు పరిసరాల్లో శవాలకోసం దెవులాడేందుకు దళితులు వెళ్తే వారిని రెడ్లు బెదిరిస్తూనే వున్నారు. మారణకాండ జరిగిన నాలుగు రోజులవరకూ నిందితులను పట్టుకునేందుకు పోలీసు యంత్రాంగం ఏ ప్రయత్నాలు చేయలేదు.

5) రాష్ట్రంలో రెడ్ల ప్రభుత్వం అధికారంలో ఉండగా, మైసూరా రెడ్డితో సహా అనేక మంది రెడ్డి కులస్తులు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజే ఈ మారణకాండ జరగడం కాకతాళీయం కాదు.

6) మారణకాండ జరిగేందుకు ముందునుంచీ దళితులదే తప్పని, వారే అగ్రవర్ణస్తులపై దాడులు చేస్తూ స్త్రీలను అవమాన పరుస్తున్నారని అగ్రవర్ణస్తులు, పోలీసులు పథకం ప్రకారం ప్రచారం చేస్తూ పత్రికలద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వచ్చారు. దళితులపై ఆ మేరకు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

గోవతోట రవిపై వందమంది రెడ్లు జులై 7న దాడి జరిపి తీవ్రంగా గాయ పర్చిన కేసు నమోదు కాలేదు. అంతకు ముందు అతని తండ్రిని బంధించి కొట్టిన కేసుకూడా నమోదు కాలేదు. వారిరువురూ ఫిర్యాదు చేసేందుకు భయపడటానికి కారణం పోలీసు యంత్రాంగ అగ్రకుల పక్షపాతం, అగ్రకులాల వల్ల తమకు భవిష్యత్‌లో కీడు జరుగుతుందని వారు భయపడటం కారణాలైనప్పటికీ, ఒక కాగ్నిజిబుల్ నేరం జరిగినప్పుడు, అది పోలీసులకు తెలిసి వారి సమక్షంలో జరిగి నప్పుడు, పోలీసు యంత్రాంగం కేసు తమకు తామే నమోదు చేసి నిందితులను వారెంటు లేకుండానే అరెస్టు చేయాల్సి వుండగా ఆ పని చేయలేదు. పైగా రవిని రక్షించేందుకు సిద్దపడి పెత్తున్న 30 మంది దళిత యువకులను పోలీసులు చెదర గొట్టారేకానీ రవిని రక్షించేందుకు వారు ఏ మాత్రం పెళ్ళలేదు. తీవ్రంగా గాయపడ్డ రవిపై సినిమాహాల్లో రెడ్ల యువకుడిని కొట్టినట్లు కేసు నమోదుచేసి అతన్ని అరెస్టుచేసి తమ అగ్రకుల పక్షపాతాన్ని నిరూపించుకున్నారు. దరిమిలా రవి, అతని తండ్రి ఊరు విడిచి పెళ్ళిపోయారు.

రెడ్లు గ్రామంలోని మాల కులస్తులపై జులై 9 నుంచి సాంఘిక బహిష్కారం చేస్తుంటే పోలీసు రెవెన్యూ యంత్రాంగాలు ఏ మాత్రం పట్టించుకోలేదు. పోలీసు బందోబస్తు ఉండగా, 144వ సెక్షన్ క్రింద నిషేధాజ్ఞలు జారీ అయివుండగానే చుట్టు ప్రక్కల గ్రామాల రెడ్లను పోగుచేసుకొని చుండూరు రెడ్లు మాలపల్లెపై జులై 12న దాడి చేయడానికి మానసిక స్థైర్యాన్ని పోలీసు యంత్రాంగమే ఇచ్చింది. గాలిలోకి కాల్పులు జరిపి, లాఠీచార్జీ చేసి గుంపును చెదరగొట్టినా, మరుసటిరోజు రెడ్లను, మాల లను సమాన సంఖ్యలో ఏరి వారిద్దరిపై హత్యాప్రయత్నం నేరాలను నమోదు చేసి కోర్టుకు పంపారు. నేరం చేసింది రెడ్లు కాగా, ఆ నేరాన్ని శాస్త్రీయంగా పరిశోధించి, నేరస్తులను అరెస్టు చేయాల్సిన పోలీసులు రాజకీయ పద్ధతిలో ఇరు వర్గాలకు చెందిన వారిని సమసంఖ్యలో పట్టుకెళ్ళి కేసుల్లో పెట్టడం పోలీసుల అగ్రకుల పక్షపాతాన్ని మరింత బహిర్గతం చేస్తుంది. అందులోనూ, మాలలను రాజీకని పిల్చి వారిలో 18 మందిని వివిధ సైజుల్లో ఏరి కేసులో ఇరికించడం పోలీసుల పక్షపాతాన్ని, వారి 'నేరపరిశోధన' బూటకత్వాన్ని సూచిస్తుంది. ఇరువర్గాలపై హత్యా ప్రయత్నం కేసులైతే పెట్టారుగానీ వెంటనే దాన్ని సెక్షన్ 324 ఐ. పి. సి క్రిందకు చిన్న కేసుగా మార్చివేశారు. ఇది జరిగిన తర్వాత దళితవాడపై పోలీసులు దాడిచేసి ఇళ్ళ

లోంచి ప్రజలను తరిమేశారు. మరి కొందరిని అరెస్టు చేశారు. రెడ్ల జోలికి మాత్రం పోలేదు.

జులై 29 నాటికి గ్రామంలో ఉద్రిక్తత ఉండి, దళితులు సాంఘిక బహిష్కరణకు లోనౌతూ పొట్టచేత పట్టుకొని ఇతర గ్రామాల్లో పనులకు వెళ్తుంటే ఏ సంఘటనా జరగలేదనే నెపంతో సెక్షన్ 144 సి.ఆర్.పి.సి. కింద అప్పటివరకూ ఉన్న నిషేధాజ్ఞలు ఎత్తివేసి పోలీసు బందోబస్తు ఉపసంహరించారు.

అగస్టు 4 వ తేదీన 10 వ తరగతి దళిత విద్యార్థి విజయపాల్ అగ్రవర్ణ స్త్రీని రాసుకుంటూ వెళ్ళాడనే నెపంతో అగ్రవర్ణస్తులు దాడిచేసి అతనికి కత్తిగాయం కాగా, గాయపడ్డ అతనిపై కేసు నమోదుచేసి పోలీసులు అరెస్టు చేశారు. కానీ అతనిపై హత్యాప్రయత్నం చేసిన వారిపై కేసు నమోదు చేయక తిరిగి పక్షపాతంగా వ్యవహరించారు.

పల్లె యాకోబు అనే చౌకడిపో డీలర్‌పై హత్యాప్రయత్నం అగస్టు 5 న జరగ్గా కేసైతే నమోదు చేశారు కానీ, ఈ నివేదిక తయారయ్యేంత వరకూ ఆ కేసు ప్రాథమిక సమాచార నివేదిక కోర్టుకు చేరలేదు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ఏ ప్రయత్నం చేయలేదు.

పైగా అగస్టు 6 న తెనాలి డి.ఎస్.పి. తెనాలి పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ అగ్రవర్ణ మహిళను దళితులు వేధిస్తున్నట్టుగా తప్పుడు ప్రకటన చేశాడు. అంతకుముందు ఒక సందర్భంలో దళితులు తమపై అగ్రవర్ణస్తుల దాడుల గురించి నేరుగా డి.ఎస్.పి. వద్దకు వెళ్ళి ఫిర్యాదుచేయగా "మీరు అక్కడ చేసేపనులు వేరుగా వుంటున్నై, ఇక్కడకొచ్చి చేసే ఫిర్యాదులు వేరుగా వుంటున్నై. ఈసారి నాదగ్గరికొస్తే బొక్కలో తోస్తాను" అంటూ బెదిరించాడని దళితులు ఆరోపించారు.

చుండూరు మారణకాండ జరిగేనాటికి దళితులు అగ్రకులస్తుల మహిళలను వేధిస్తున్నారనేందుకు, డి.ఎస్.పి. గానీ, అగ్రకులస్తులుగానీ చూపుతున్నది ఒకే ఒక 'ఘటన' మాత్రమే. పదవతరగతి విద్యార్థి విజయపాల్ ఒక అగ్రవర్ణ మహిళను బజార్లో భుజం రాసుకుంటూ వెళ్ళాడని ఆరోపించడం మినహా మరో సంఘటన ఉదహరించలేము. మారణకాండ జరిగిన తర్వాత మాత్రం దళిత యువకులు తమవారి ననేకమందిని రేప్ చేశారని, జాకెట్లు చించారని, పొలాల్లో బట్టలిప్పించి, నాట్లు

వేయించారని దుష్ప్రచారం చేయబూనుకున్నారు. అగ్రవర్ణస్తుల ఈ ఘోరమైన ఫాసిస్టు దుష్ప్రచారం వట్టి బూటకమని పైన వివరించిన విషయాలు తెలియజేస్తాయి. ఒక దళితుడు కాఫీ హోటళ్ళలో పక్కన కూర్చుంటేనే సహించని అగ్ర వర్ణ దురహంకారులతో నిండిన చోట దళితులు ఏకంగా రేపులకు పాల్పడితే, అగ్ర వర్ణస్తులు ఏ మాత్రం ఆలస్యం చేయక, ఆ దళితులను అగ్నికి ఆహుతి చేసి ఆ మంటలు చూసి ఆనందం పొందుతారే తప్ప కొన్నాళ్ళపాటు వేచి చూస్తారని అనుకొనేందుకు ఏ మాత్రం ఆస్కారం లేదు. దళితులపై ఒకటి, అరా రేప్ కేసులు నమోదైనా, అగ్రవర్ణస్తులు చేసే రేపులు రికార్డుల్లో దొరకవనే నగ్న సత్యంతో పోలిస్తే రేపుల సంస్కృతి అగ్రవర్ణస్తులదేనని, దళిత స్త్రీలు అగ్రవర్ణ కామాంధకారానికే బలయ్యే పశువులుగా మార్చబడ్డారనేది జగద్విదితం, చరిత్ర చెప్తున్న సత్యం. సామాన్య ప్రజల సెంటిమెంట్లకు అప్పీల్ చేసేందుకు ఈ విధమైన దుష్ప్రచారానికి అగ్రకులస్తులు పాల్పడుతున్నారు.

## నిజనిర్ధారణ కమిటీ డిమాండ్స్

పై వాస్తవాల, నిర్ధారణల వెలుగులో నిజనిర్ధారణ కమిటీ ఈ క్రింది డిమాండ్లు చేస్తోంది :

1. చుండూరు మారణకాండపై కేంద్ర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తు చేయించాలి.
2. అగ్రవర్ణ హంతకుల కోసం తీవ్రగాలింపు చర్యలు చేపట్టి వారిని వెంటనే అరెస్టు చేయాలి. లొంగిపోని ముద్దాయిలను Fugitive Offenders గా ప్రకటించి వారి స్థిరాస్తులను జప్తుచేయాలి. ఈ విషయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.
3. వెంటనే పోలీసు జాగిలాలను, గజఈతగాళ్ళను రప్పించి శవాల కోసం తీవ్రగాలింపు చర్యలు యుద్ధప్రాతిపదిక మీద చేపట్టాలి. ఆచూకీ తెలియని వారి ఆచూకీ తెలుసుకొనేందుకు వివిధ చర్యలు చేపట్టాలి.

4. చుండూరు మారణకాండకు జరిగిన కుట్రలో, ప్రోత్సాహంలో, హత్య కేసుల్లో తెనాలి డి.ఎస్.పి జె. రాయలయ్యను, తెనాలి రూరల్ సి.ఐ. టి.వి. శాయిబాబును, చుండూరులో ఘటన జరిగిన రోజు ఉన్న వేమూరు ఎస్.ఐ. ముబారక్ వలితో సహా ఏడుగురు ఎస్.ఐ.లను ముద్దాయిలుగా చేర్చి వెంటనే అరెస్టు చేయాలి. వారందరినీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 311 కింద ఉద్యోగాల్లోంచి తక్షణం డిస్మిస్ చేయాలి.

5. అగ్రకుల పక్షపాతంతో పాత్రవహించిన చుండూరు యం.ఆర్.వోను తక్షణం సర్వీసునుంచి డిస్మిస్ చేయాలి.

6. చుండూరు మారణకాండకు ముందూ, ఆ తర్వాత అధికార యంత్రాంగం పాత్రపై హైకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలి.

7. చనిపోయిన వారి కుటుంబాలకు, ఆచూకీ తెలియకుండాపోయి దొరకని వారి కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి.

8. చుండూరు, మోదుకూరు, మున్నంగివారిపాలెం వగైరా దాడిలో పాల్గొన్న గ్రామాల అగ్రకులస్తులపై "చుండూరు మారణకాండ పన్ను" పేరిట డబ్బును వసూలుచేసి దళితుల కోసం ఖర్చుపెట్టాలి.

9. అగ్రవర్ణ హంతకులను కేసు విచారణ ముగిసిందాకా బెయిల్ రాకుండా సి.ఆర్.పి.సి లోని 437, 439 సెక్షన్లు సవరిస్తూ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు జారీచేయాలి.

10. చుండూరు మారణకాండను విచారించేందుకు ప్రత్యేక మెజిస్ట్రేట్, సెషన్సు కోర్టులను ఏర్పాటుచేసి కేసు విచారణ పూర్తి చేసేందుకు నిర్ణీత కాలపరిమితి నిర్ణయించాలి.

నిజనిర్ధారణ కమిటీ

గుంటూరు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (OPDR)

15-8-91 ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

## అనుబంధం - I

# మారణకాండలో హతుల పేర్లు, వివరాలు

| | |
|---|---|
| 1. జాలాది మత్తయ్య (40)<br>2. జాలాది ఇమ్మాన్యుయేల్ (38)<br>3. మల్లెల సుబ్బారావు (30) | చుండూరు సమీపంలో మల్లెతోటవద్ద పక్కనేవున్న తుంగభద్ర డ్రైన్‌లో ఈ ముగ్గురి శవాలు లభ్యమయ్యాయి. |
| 4. జాలాది ఇస్సాక్ (25) | మోదుకూరు రైల్వేస్టేషన్ సమీపంలో తుంగభద్ర సైడ్ ఛానల్ (తూర్పు కాల్వ - లేదా పంటకాల్వ)లో గోనె సంచిలో ఈ శవం వెలికితీశారు. |
| 5. అంగలకుదురు రాజమోహన్ (25) | మోదుకూరు గ్రామంలో తుంగభద్ర డ్రైన్‌లో గోనెసంచిలో ఈ శవం కనుగొన్నారు. |
| 6. సంకురు సంసోను (28)<br>7. దేవరపల్లి జయరాజు (30) | మోదుకూరు సమీపంలోని పంటకాల్వకున్న ఇంటూరు లాక్‌వద్ద వీరిద్దరి శవాలు దొరికాయి. |
| 8. మంద్రు రమేష్ (22) | మోదుకూరు సమీపంలో తుంగభద్ర సైడ్ ఛానల్‌కు 1 వ నెంబరు బ్రాంచి కాల్వలో ఇతని శవం వెలికితీయబడింది. |

## అనుబంధం - II

# ఆచూకీ తెలియనివారి పేర్లు :

1. దేవరపల్లి ఏసుపాదం
2. బత్తుల ధారాసింగు
3. బండికళ్ళ పాపారావు
4. తానా చింతల ఆదాం
5. నీచు రంగయ్య
6. గూడూరు రంగయ్య

7. బోరుగడ్డ సాంబయ్య
8. దేవరపల్లి ప్రసాద్
9. పెరికల దేవదాసు
10. తప్పెట బాబు
11. జాలాది సంతోషరావు
12. జాలాది మధుసూధనరావు
13. ఆలూరి దిబ్బయ్య
14. జాలాది ప్రకాశరావు

## అనుబంధం - III

[చుండూరులో దళితులు అగ్రకుల దురహంకారుల మారణకాండకు బలై కకావికలై ఛీతిల్లి, పరుగెత్తి, క్రూరంగా చంపబడి, గోతాల్లో కుక్కబడి, పంట కాల్వల్లో, చేలల్లో, మురుగుకాల్వల్లో శవాలై తేలినరోజు (ఆగస్టు 6వ తేదీ) సాయంత్రం తెనాలి డి. ఎస్. పి. జె. రాయలయ్య పత్రికలకు అగ్రవర్ణ పక్షపాతంతో చెప్పిన వార్తలు అది ప్రచురించబడిన తీరు ఈ అనుబంధంలో ఇస్తున్నాం.]

ఈనాడు (జిల్లా పేజీ)

## చుండూరుకు మళ్ళీ పోలీసు బలగాలు

తెనాలి, ఆగస్టు 6 (న్యూస్‌టుడే): మండల కేంద్రమైన చుండూరులో గత మూడు వారాలుగా స్వల్ప ఘటనలపై నెలకొనివున్న ఉద్రిక్తత తీవ్రం కావడంతో సోమవారం సాయంత్రం అదనపు పోలీసు బలగాల్ని పంపారు. సోమవారం సాయంత్రం చాకడిపో డీలరును కత్తితో పొడిచిన సంఘటనవల్ల ఉద్రిక్తత ఏర్పడింది. మంగళవారం మరో స్వల్ప ఘటనవల్ల ఉభయవర్గాల మధ్య వైషమ్యాలు పెరిగాయి. గ్రామంలో నెలకొంటున్న సంఘటనలు స్వల్పమే అయినా పోలీసులను అప్రమత్తంగానే వుంచామని, కవ్వింపు చర్యలకు కారకులని భావించిన 50 మందిని అరెస్టు చేశామని డి. ఎస్. పి. శ్రీ జె. రాయలయ్య తెలిపారు. పరిస్థితి పూర్తిగా అదుపులో వుందని, తాజా సంఘటనలకు కారకులైన వారికోసం గాలింపు కొనసాగుతోందని అన్నారు.

ఆంధ్రభూమి (జిల్లా పేజీ)

# చుండూరులో ఉద్రిక్తత : పోలీసు సిద్ధం

తెనాలి, ఆగస్టు 6 (న్యూస్‌స్లాష్): మండల కేంద్రం చుండూరులో గత మూడురోజులుగా అగ్రవర్ణాలకు, హరిజనులకు మధ్య జరిగిన ఘర్షణల కారణంగా తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సోమ, మంగళవారాల్లో పలు కత్తిపోట్ల సంఘటనలు జరిగాయి. సోమవారం మధ్యాహ్నం హరిజన కాలనీ చౌకడిపో డీలర్ గోళ్ళమూడి యాకోబు (25)పై అగ్రవర్ణాలకు చెందిన ఇక్కుర్తి శివయ్య, ఇక్కుర్తి లక్ష్మయ్య, తిప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పద్యాలబాబు మరి ఆరుగురు మారణాయుధాలతో దాడిచేసి గాయపర్చినట్లు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాకోబు తెలిపారు. ఈ మేరకు చుండూరు పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చేసినట్లు తెలిపారు. అతనికి తొడ వెనుకపైపు, కుడి పిలమండపై తీవ్ర గాయాలైనాయి. సమయానికి ఎస్.ఐ. రావటంతో ప్రాణాలతో బయటపడినట్లు ఆయన తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం అగ్రవర్ణాలకు చెందిన ముగ్గురు యువతులు నిద్రిస్తున్న సమయంలో ప్రత్యర్థివర్గాలకు చెందిన యువకులు అల్లరి పెట్టారని, అదే సమయంలో సమీపంలో వున్న అగ్రవర్ణానికి చెందిన యువకుడు ఇదేమిటని హరిజనులను అడగ్గా వారతనిని కొట్టారని పోలీసువర్గాలు పేర్కొన్నాయి. పెద్దఎత్తున బందోబస్తుకి, రోజురోజుకి గ్రామంలో పెరుగుతున్న ఉద్రిక్తతను చల్లార్చేందుకు, అవాంఛనీయ సంఘటనలు నివారణకు, గుంటూరు నుంచి రిజర్వు పోలీసు దళాలను రప్పించారు. అంతేకాక తెనాలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సాయిబాబు పర్యవేక్షణలో కొల్లూరు, కొల్లిపర, దుగ్గిరాల, అమృతలూరు, వేమూరు, తెనాలికి చెందిన ఎనిమిది మంది ఎస్.ఐ.లు చుండూరులో మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## అనుబంధం IV

# గుంటూరు జిల్లా కలెక్టర్‌కు చుండూరు యం.ఆర్వో. నివేదిక

చుండూరు మారణకాండ తర్వాత గుంటూరు జిల్లా కలెక్టరుకు, చుండూరు

యం.ఆర్వో. పంపిన నివేదికను ఇంగ్లీషునుంచి తర్జుమాచేసి ఈ అనుబంధంలో ఇస్తున్నాం. దేశం మొత్తం చలించిపోయి పార్లమెంటులో చర్చించబడి, ప్రజల్లో అట్టుడికిన ఈ సంఘటనపై ఎలాంటి ఉద్వేగానికీ, దయకూ, బాధ వగైరా మానవ స్పందనలకు తావివ్వకుండా అధికారిక యాంత్రిక భాషలో, వాస్తవాల వక్రీకరణతో, కొన్ని వాస్తవాలను మరుగునపరుస్తూ అగ్రకుల పక్షపాతంలో రాయబడినదని ఈ నివేదికను చదివిన వారెవరికైనా ఇట్టే అర్థమౌతుంది. తేదీ లేని ఈ నివేదికలోని అంశాలను బట్టి ఈ నివేదిక ఆగస్టు 7వ తేదీన తయారుచేశారని తెలుస్తుంది].

# చుండూరు మండలం చుండూరు గ్రామంలో

# 6-8-1991 నాడు జరిగిన సంఘటనలపై నివేదిక

6-8-91నాడు చుండూరులో జరిగిన సంఘటన. పెద్ద సంఘటన గత నెల 15వ తేదీనుండి గ్రామంలో జరిగిన స్వల్ప ఘటనల పర్యవసానాల తర్వాత అది జరిగింది.

హరిజనవాడకు సమీపంలో ఉన్న సినిమా థియేటర్‌లో 7-7-1991న ఒక సంఘటన జరిగింది. అందులో ఎస్. సి యువకులకు ఇతర కులాలకు చెందిన వ్యక్తులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఆ క్రమంలో రెడ్డి కులానికి చెందిన యువకు డొకరిని కొట్టారు. ఆ తర్వాత, గ్రామంలో రెండు గ్రూపులకు మధ్య ఉద్రిక్తత నెలకొన్నది.

15-7-1991న రెండు కులాలకు మధ్య తిరిగి ఘర్షణలు జరిగాయి. వెంటనే, ప్రాథమిక సమాచార నివేదిక నమోదై రెండు గ్రూపులకు చెందిన వ్యక్తులు అరెస్టు చేయబడ్డారు. సి. ఆర్. పి. సి. 107వ సెక్షన్ క్రింద తెనాలి ఆర్. డి. వో ప్రత్యేక ప్రొసీడింగ్స్‌ను చేపట్టారు. 4-8-91 వరకూ తిరిగి ఘటనలు జరగలేదు.

4-8-1991న స్థానిక సినిమా థియేటర్ వద్ద, శ్రీ రాజబాబు అనే ఎస్. సి. యువకుడు ముగ్గురు అగ్రవర్ణ బాలికలను వేధించాడు. ఫలితంగా వాగ్వివాదం జరిగి తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి అతన్ని బాగా కొట్టాడు.

5-8-1991 ఉదయం అగ్రకులానికి చెందిన ఇక్కుర్తి శేషగిరిరావు కాల కృత్యాలు తీర్చుకునేందుకు S. C. ప్రాంతం దాపుకు వెళ్ళగా, కొందరు షెడ్యూల్డు కులానికి చెందిన యువకులు అతనితో తగాదా పెట్టుకొని కొట్టారు. ఈ సంఘటనను అనుసరిస్తూ, మరొక సంఘటన జరిగి అందులో ఎస్. సి. కులానికి చెందిన చౌక దుకాణదారుడు శ్రీ జి. యాకూబ్ మండల రెవెన్యూ కార్యాలయానికి వస్తుండగా దాడికి గురయ్యాడు. ఆ సంఘటనపై కూడా ఎఫ్. ఐ. ఆర్. నమోదయింది.

పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతూవుంటే, 5-8-1991న మరింత పోలీసు బలగాన్ని గ్రామానికి పంపారు. ఒక సి. ఐ, ఏడుగురు ఎస్. ఐలు, 50 మంది కానిస్టేబుళ్ళతో పోలీసు బృందం గ్రామంలో బస చేసి వుంది. 6-8-91 ఉదయం జరిగిన అనేక సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, పోలీసులు గొడవలు సృష్టించే వారిలో కొందరిని అరెస్టు చేసేందుకు ఎస్. సి. ప్రాంతానికి వెళ్ళారు. అరెస్టు చేస్తారని భయపడి ఎస్. సి. ప్రాంతంలో నివసించేవారు తమ ప్రాంతంనుండి పొలాల వేపుగా పరిగెత్తి వెళ్ళిపోయారు.

11 గంటల ప్రాంతంలో పొలాల్లో ఎస్. సి. పిల్లల గుంపు కొందరు అగ్ర కుల రైతులను కొట్టారని, నలుగురు వ్యక్తులకు స్వల్పగా గాయలయ్యాయని ఫిర్యాదు చేయబడింది. ఈ సంఘటన గ్రామంలో మరింత ఉద్రిక్తతను సృష్టించింది. అగ్ర కులానికి చెందిన వ్యక్తులు గుంపుగా ఏర్పడి, అరెస్టులను తప్పించుకునేందుకు పొలాల్లోకి వెళ్ళిన ఎస్. సి.లపై దాడి ప్రారంభించారు.

ఆ రోజు అనగా 6-8-91న ఎస్. సిలపై నిజంగా దాడి జరిగిన ఘటన గ్రామంలో రిపోర్ట్ కాలేదు. అర్థరాత్రికి మాత్రమే, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారికి మొదటి ఫిర్యాదు చేరింది. మొట్టమొదటిగా చేసిన గాలింపులో ఎలాంటి మరణాలు బయటపడలేదు. ఏమైనప్పటికీ, తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు గాయపడ్డ ఎస్. సి. తామే స్వయంగా శరణంలో అదనపు వివరాలు లభ్యమయ్యాయి. 7-8-91న గ్రామానికి దగ్గరగా ప్రవహించే తుంగభద్ర మురుగు కాల్వ వెంట మరింత గాలింపు జరుపబడింది. సాయంత్రం 3 గంటల ప్రాంతానికి రెండు శవాలు, సాయంత్రం సుమారు 6 గంటలకు మూడో శవం కనుగొనబడ్డాయి.

కనుగొనబడిన శవాల పేర్లు ఈ క్రింద ఇవ్వబడ్డాయి :

1. శ్రీ జాలాది ముత్తయ్య, తండ్రి శామ్యుయేల్, 35 సం॥లు [ఎస్. సి]
2. శ్రీ జాలాది ఇమ్మాన్యుయేల్, తండ్రి శామ్యుయేల్, 40 సం॥లు [ఎస్. సి]
3. శ్రీ మంద్రు రమేష్, తండ్రి లేట్ లక్ష్మయ్య, 22 సం॥లు [ఎస్. సి]

తెనాలి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడ్డ ఇద్దరు వ్యక్తుల పేర్లు ఈ క్రింద ఇవ్వబడ్డాయి.

1. శ్రీ పంతగాని జక్రయ్య, తండ్రి రంగయ్య
   65 సం॥లు, చుండూరు గ్రామం .... షెడ్యూల్డు కులం
2. శ్రీ దయిరి ధనరాజు, తండ్రి మోషె
   18 సం॥లు, చుండూరు గ్రామం .... షెడ్యూల్డు కులం

ఈ క్రింది వ్యక్తులు ఇంకా ఆచూకీ తెలియకుండా పోయారని ఫిర్యాదు చేయబడింది.

1. శ్రీ దేవరపల్లి దేవదానం, తండ్రి లేట్ కార్నేలు
   30 సం॥లు, చుండూరు గ్రామం
2. శ్రీ మేల్లెల సుబ్బారావు, తండ్రి నాగయ్య, 30 సం॥లు
   చుండూరు గ్రామం
3. శ్రీ జాలాది ఇస్సాక్, తండ్రి భూషణం, 25 సం॥లు
   చుండూరు గ్రామం
4. శ్రీ సంకురు సంసోను, తండ్రి కోటయ్య
   వయస్సు 28 సం॥లు, చుండూరు గ్రామం

5. శ్రీ అంగలకుదుర రాజమోహన్, తండ్రి ఏసు
వయస్సు 25 సం॥లు, చుండూరు గ్రామం

6. శ్రీ బండికళ్ళ పాపారావు, తండ్రి లేట్ ఆనందరావు
35 సం॥లు చుండూరు గ్రామం

పైన పేర్కొన్న జాడ తెలియకుండాపోయిన వ్యక్తులను కనుగొనేందుకు అదనపు గాలింపు బృందాలు పంపబడ్డాయి.

సహాయ చర్యల్లో భాగంగా, గాయపడినవారికి ఒక్కొక్కరికి రు. 2000/- మొత్తం, చనిపోయిన వారి కుటుంబానికి రు. 10,000 అందజేస్తున్నాం. బాధితులకు బియ్యం పంచేందుకు కూడా సన్నాహాలు చేయబడుతున్నాయి.